

సిపిఆర్‌తో ప్రాణ రక్షణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని సిపిఆర్ ద్వారా రక్షించవచ్చని ప్రభుత్వ సివిల్ సర్జన్ ఎవి రమణ అన్నారు. ప్రత్తిపాడులో టోల్ ప్లాజా సిబ్బందికి అత్యవసర చికిత్స సిపిఆర్ విధానంపై ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడ్డ వారికి రక్తపోటు ఎక్కువ ఉంటే గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. సిపిఆర్ విధానానంలో శిక్షణ పొందిన సిబ్బంది మరి కొంతమందికి శిక్షణ ఇవ్వడం, వారు మరికొంతమందికి శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ కష్ణ చైతన్య, అకౌంటెంట్ రాజశేఖర్, ప్లాజా మేనేజర్ కరీముల్లా, ఐఎన్‌టి మేనేజర్ సుబ్బారావు, ఐఎంటి ఆఫీసర్ ధనకుమార్, చంద్రు రాథోడ్, అసిస్టెంట్ మేనేజర్ మధు పాల్గొన్నారు.

అందని మూడో విడత ఆసరా

ఎదురు చూస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సహాయం అందించాలనే లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ఆసరా పథకం మూడో విడత లబ్ధి కోసం పేద మహిళలకు ఎదురు చూపులు తప్పడం లేదు. నిధుల కొరతతో ఈ పథకం అమల్లో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమను తాము పోషించుకోలేని వారికి ఆర్థిక సహాయం అందించడం కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సహాయం అండడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అతివలకు ఆసరా కరువు

మూడో విడత ఆసరా పథకం వాస్తవానికి గతేడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో అమలు చేయాల్సి ఉంది. అయితే నాలుగు నెలలు ముగిసి ఐదో నెల గడుస్తున్నా నేటికీ జమ కాకపోవడంతో మహిళలకు ఆర్థిక కష్టాలు ఎక్కువయ్యాయి. కాకినాడ జిల్లాలో 39,971 స్వయం సహాయక బందాల (ఎస్‌హెచ్‌జి)లు ఉండగా వీటిల్లో 3,99,710 సభ్యులున్నారు. వీరంతా అర్హత ఉన్నట్లు గుర్తించారు.



వైయస్సార్ ఆసరా పథకంలో భాగంగా 2020 సెప్టెంబరులో మొదటి విడతలో 28,950 సంఘాల్లో 2,87,680 మంది సభ్యులకు రూ.238.21 కోట్లు విడుదల చేసారు. రెండో విడత 2021 అక్టోబరులో 29,391 సంఘాల్లో 2,91,986 మంది సభ్యులకు రూ. 245.00 కోట్లు జమ చేసారు. మూడో విడత గతేడాది అక్టోబరు, సెప్టెంబరు నెలల్లో ఇస్తారని పేద మహిళలు ఆశించారు. కానీ నిధుల లేమితో ప్రభుత్వం ఆసరా పథకాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడో విడతలో కూడా 29,385 సంఘాల్లో 2,91,097 మంది సభ్యులకు రూ.241.25 కోట్లు ఇవ్వాలని అధికారులు జాబితాలను సిద్ధం చేసారు. ఈ మేరకు ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియను కూడా పూర్తి చేసారు. కాకినాడ రూరల్ మండలంలో అత్యధికంగా 2,784 సంఘాలకు సుమారు రూ.22.90 కోట్లు, రౌతులపూడి మండలంలోని 800 సంఘాల్లో 8107 సభ్యులకు రూ. 5.17 కోట్లు అతి తక్కువగా లబ్ధి పొందనున్నారు. అయితే సొమ్ములు ఎప్పుడు జమ అవుతాయి అనేది నేటికీ స్పష్టత లేకపోవడంతో మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ నెల 26వ తేదీ కల్లా జమ చేసే అవకాశం ఉందని అధికారులు చెప్పుకొస్తున్నారు.

నిధులు విడుదల కాగానే జమ చేస్తాం

వైయస్సార్ ఆసరా పథకంలో భాగంగా లబ్ధిదారుల జాబితాలను ఇప్పటికే సిద్ధం చేశాం. బయోమెట్రిక్ ప్రక్రియను కూడా పూర్తి చేశాము. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే మహిళల ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ అవుతాయి.

- కె.శ్రీరమణి, డిఆర్‌డిఎ పీడీ, కాకినాడ జిల్లా

సాగునీరందించలేని వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - తాళ్లరేవు

వ్యవసాయానికి సాగునీరు సక్రమంగా అందించలేని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎటువంటి న్యాయం చేస్తుందని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు నీరు లేక ఎండిపోయిన తాళ్ళరేవు మండలం చొల్లంగి, పి.మల్లవరం, గ్రాంటు శివారు పంట భూములను ఆయన తెలుగుదేశం పార్టీ మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎండిపోయిన పంటను బుచ్చిరాజుకి చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. దీనిపై ఆయన జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులు మోటార్ సైకిల్ లను తమ పొలాల్లో తిప్పుతూ తమ పంట పరిస్థితిని వివరించారు. ఇప్పటికే పంట నష్టపోయిన పొలాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, మోపూరి వెంకటేశ్వరరావు, దున్న మురళి, ధూళిపూడి సుబ్బారావు తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ సుబ్బరాజు

ఇరిగేషన్ అధికారులపై రైతుల ఆగ్రహం

ఒకపక్క నీటి ఎద్దడితో రైతులు సతమతం అవుతుంటే ఒకపక్క నీటి పారుదల శాఖ అధికారులు సాగు నీరు వథా చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం మల్లంకోట లాకుల వద్ద ఇరిగేషన్ అధికారులను రైతులు నిలదీశారు. తాళ్లరేవు మండలంలోని కోరంగి శివారు మల్లంకోట లాకుల వద్ద సాగు నీరు వథా అవుతున్న అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతు పితాని సత్తిబాబు తెలిపారు. ఇంజరం వంతెన దిగువన పంట కాలువలో సకాలంలో పూడిక తీయకపోవడం వల్ల మండలానికి పూర్తిస్థాయిలో సాగునీరు రావడం లేదని, వచ్చిన సాగునీరు కాస్త మల్లంకోట వద్ద వథాగా సముద్రంలోకి పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు సాగు నీరు వృథా కాకుండా పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలంటున్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

ప్రజాశక్తి -కరప

రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన నిర్వహిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదింపాలని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. గురజనాపల్లిలో ఆదివారం ఇంటింటికీ మీ అనంతలక్ష్మితో పాటు ఇదేం కర్మ మన రాష్ట్రానికి 93వ రోజు భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెందాలంటే వైసిపి ప్రభుత్వం గద్దె దిగాలన్నారు. ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందన్నారు. ప్రజలు ఏదైనా మాట్లాడితే బెదిరింపులకు పాల్పడుతూ పథకాలు తీసేస్తామని భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. అప్పులు తెస్తేగాని ఉద్యోగుల జీతాలు ఇవ్వలేని దయనీయ స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చిన ఘనత సిఎం జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బుంగా సింహాద్రి క్లస్టర్ ఇన్‌ఛార్జి గండి వెంకటేశ్వరరావు నాయకులు, పబ్బినీడి చిన్నబాబు, పంపన కన్నారావు, కోట శ్రీను, పబ్బినీడి కృష్ణ సాయి, మాసా సత్యనారాయణ, పాలిక నాగబాబు, వై.సుకుమార్ పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ అర్చకుడు మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పంచారామక్షేత్రం భీమేశ్వరాలయం ప్రధాన అర్చకులు చెరకూరి భీమేశ్వర శర్మ (48) ఆదివారం మృతి చెందారు. ఈయన గత వారం రోజులుగా అస్వస్థతకు గురై కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన తండ్రి చెరకూరి సర్వేశ్వర శర్మ అనంతరం ఈయనను ప్రధాన అర్చకునిగా నియమించారు. చిన్నవయస్సులో భీమేశ్వర శర్మ మృతి చెందడం పట్ల ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది, ట్రస్టుబోర్డు సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక భీమేశ్వరాలయం చెంతనే వున్న రోటరీ కైలాసభూమిలో ఆదివారం భీమేశ్వర శర్మ పార్థీవ దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి కాకినాడ రూరల్

కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని స్కానింగ్ ద్వారా తెలియగానే కనికరం లేకుండా పలువురు తల్లిదండ్రులు అబార్షన్ చేయించుకుంటున్నారని ఇది చట్టరీత్యా నేరమని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్య పరిస్థితిని గమనించడానికి స్కానింగ్ అవసరమన్నారు. అయితే ఈ స్కానింగ్ ద్వారా ఆడపిల్ల అని తెలియగానే ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భస్రావం చేయించు కుంటున్నారని ఇది నేరమన్నారు. ఇటీవల ప్రభుత్వం స్కానింగ్ సెంటర్లపై గట్టి నిఘా ఏర్పాటు చేసిందన్నారు. స్కానింగ్ సెంటర్ల ద్వారా ఆడ శిశువు లేదా మగ శిశువో నిర్ధారించడం చట్టరీత్యా నేరం అని పట్నాయక్ తెలిపారు. అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్

టిడిపిలో 200 మంది చేరిక

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం సూరంపాలెంలో కుంచే రామకష్ణ ఆధ్వర్యంలో 200 మంది టిడిపిలో చేరారు. వారికి టిడిపి ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. దేవన వీరబాబు, అల్లం వెంకటరంగయ్య, అల్లం విష్ణు, కోట్టు గంగరాజు, అల్లం విష్ణు, అల్లం సుబ్బారావు, ఎర్ర అబ్బ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఎప్పుడు తనను అభిమానించే సూరంపాలెం గ్రామనుండి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వారందరినీ పాత కొత్త కలయికతో పార్టీని ముందుకు నడిపిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ రాష్ట్రాన్ని అప్పుల కూపంగా మార్చారని, ప్రతి మంగళవారం రిజర్వు బ్యాంకు వద్ద అప్పు తీసుకువస్తున్నారని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందని చెప్పారు. ఈ గ్రామంలో ఈ పాలకులు గ్రావెల్ దోచేస్తున్నారని అన్నారు. ఈ రాష్ట్రంలో అన్ని రకాలుగా విచ్ఛిన్నం అయిందని రాష్ట్రం మళ్ళీ అభివద్ధి పథంలో నడవాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, ఆదినారాయణ, బొల్లం రెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, కంటిపూడి రామయ్య, ప్రగడరెడ్డి వీరబాబు, అల్లం గోవిందు, మేడిశెట్టి నారాయణరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్ కుమార్

యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి-గండేపల్లి

విద్యార్థులు గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటివి వాడటం వల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతుందని అటువంటి పరిస్థితి తెచ్చుకోవద్దని ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు. గండేపల్లి మండలం సూరంపాలెం కాలేజీలకు సంబంధించిన విద్యార్థులకు ఆదివారం ఆయన అవగాహన కల్పిచారు. సూరంపాలెం ప్రగతి కాలేజ్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్, రామేశంపేట గ్రామంలోని హాస్టల్స్‌లో విద్యార్థులతో ఆదివారం ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వాడినా అమ్మినా ఎస్ఇబి కంట్రోల్ 14500 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం అనే పోస్టర్స్‌ను కాలేజీలు, హాస్టల్స్‌లో ప్రదర్శించారు.


స్మార్ట్ ల్యాబుల సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆధునిక సౌకర్యాలతో వైద్య పరీక్షలు చేసే విధంగా స్మార్ట్ లేబరేటరీస్ ఏర్పాటు చేసినట్టు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, స్మార్ట్ లేబరేటరీ సిఇఒ కష్ణ చైతన్య పేర్కొన్నారు. ఆదివారం పేరాజుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ లేబరేటరీస్‌ను కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాలిక్యులర్ బయాలజీ పరీక్షలను హైదరాబాద్ బొంబాయి ఢిల్లీ వంటి నగరాల్లో నిర్వహించడం జరిగేదని తెలిపారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో స్మార్ట్ లేబరేటర్స్‌లో సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీనివల్ల రోగుకు సకాలంలో వైద్యం అందించేందుకు పరీక్షలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. త్వరలో అమలాపురం వైజాగ్ నెల్లూరు గుంటూరులో బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ లేబరేటరీస్ చైర్మన్ వెన్నెల దీపక్, మై ల్యాబ్ జోనల్ మేనేజర్ రంగనాయకులు, తెలంగాణ రాష్ట్ర మేనేజర్ డయానా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి



రాజకు నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

వరుపుల రాజా మృతి దురదృష్టకరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

టిడిపి యువ నేత వరుపుల రాజా మతి దురదృష్టకరమని, టిడిపికి ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలకు ఆయన మరణం తీరని లోటని మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రత్తిపాడులోని రాజా స్వగహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజా సతీమణి సత్యప్రభను పరామర్శించి వారి కుటుంబానికి తామంతా అండగా ఉన్నామన్నారు. నివాళు లర్పించిన వారిలో పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి వివివి చౌదరి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, వైస్ చైర్మన్ పెండ్యాల శ్రీకాంత్ ఉన్నారు.

కార్టూ'నిజం'



ఇంకెక్కడి ప్రభుత్వ భూములయ్యా.. అన్నీ తాకట్టులో ఉంటేనూ..!!



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో సోమలంక త్యాగరాజు వర్ధంతి సందర్భంగా వద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ గతించిన కుటుంబ పెద్దను మరచిపోకుండా ఆయన వర్ధంతి సందర్భంగా వద్ధులకు, ఒంటరి మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ భారత్ పార్టీకి విరాళం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జైభీమ్ భారత్ పార్టీకి కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు జగ్గారపు మల్లికార్జున రూ.50 వేలు విరాళంగా అందించారు. ఆదివారం విజయవాడలో పార్టీ కార్యాలయంలో జైభీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నారని, ఆయన చేస్తున్న పోరాటాల్లో తను కూడా భాగస్వామిగా ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందని మల్లిఖార్జున తెలిపారు. జడ శ్రావణ్ కుమార్ కష్టపడి పనిచేస్తూ, తన సొంత సంపాదనతో పార్టీని నడుపుతున్నారని, పార్టీ కోసం తన వంతు చిన్న సాయంగా విరాళం ఇచ్చినట్లు పార్టీ రాష్ట్ర వర్కింగ్ జనరల్ సెక్రెటరీ మరియు కాకినాడ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జగ్గారపు మల్లిఖార్జున తెలిపారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ ఉత్సవాలు


జిల్లాలోని పలుప్రాంతాల్లో వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకుల ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ ప్రతి పేదవాడి గుండె చప్పుడు వినే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డని వైసిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేటలోని వైద్యనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడ ఎంపి వంగా గీత, ఎంఎల్‌సి అభ్యర్థి కర్రి పద్మశ్రీతో కలిసి ఎంఎల్ఎ కన్నబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నురుకుర్తి రామకష్ణ, ఎంపిపిలు గోపిశెట్టి పద్మజాబాబ్జి, పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, వైస్ ఎంపిపి బందిలి విరీషా, అల్లి రాజబాబు, జమ్మలమడక నాగమణి పాల్గొన్నారు **పెద్దాపురం** మండలం కాండ్రకోటలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, సొసైటీ చైర్మన్ పళ్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ పాల్గొన్నారు. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. **రౌతులపూడి** మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షులు జిగిరెడ్డి శ్రీను, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర్ బాబు, వాసిరెడ్డి జమీలు, పులి మధు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేపట్టారు. ఎస్.పైడిపాలలో జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. **కాజులూరులో** రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వనుం సుబ్బారావు ఎంపిపి మాత భారతి మురళి, బిసి సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు పాల్గొన్నారు. **గండేపల్లి** మాజీ మంత్రి తోట నరసింహం తనయుడు రాంజీ ఆధ్వర్యంలో ఉప్పల పాడులో వేడుకలు నిర్వహించారు. రామకుర్తి శ్రీరామ చంద్రమూర్తి ఏర్పాటు చేసిన విందులో రాంజీ కేకును కట్ చేసి అభిమానులకు తినిపించారు. **సామర్లకోట రూరల్** హౌసింగు కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు క్యాంప్ కార్యాలయంలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిరి మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌ఫర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, పట్టణ, మండల వైసిపి అధ్యక్షులు మద్దాల శ్రీను, తాటికొండ అచ్చిరాజు, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, జిల్లా పంచాయితీరాజ్ అధ్యక్షులు మోరంపూడి రంగనాయకులు, రాష్ట్ర బిసి అయ్యరక కార్పోరేషన్ చైర్‌ఫర్సన్ ఆవాల రాజేశ్వరి లక్ష్మీనారాయణ, దవులూరి సుబ్బారావు, ఎఎంసి చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబాజాన్ మోజెస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కాకినాడలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ



సామర్లకోటలో పండ్లు పంపిణీ చేస్తున్న దొరబాబు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

వారంతా పూర్వ విద్యార్థులు. 37 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని జ్ఞాపకాలు పంచుకున్నారు. అప్పుడు పాఠాలు చెప్పిన గురువులను ఇంటికి వెళ్లి సాదరంగా ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. చదివిన పాఠశాలకు మేలు చేయాలని తలో కొంత నగదు వేసుకుని రూ.3 లక్షలతో పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1985 - 86 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు. తాము చదివిన పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ షెడ్డు నిర్మాణం, పాఠశాల గదులకు గ్రిల్స్ ఏర్పాటు చేయడమే కాకుండా, సరస్వతీదేవి, పాఠశాల నిర్మాణ స్థలదాత నామన వెంకాయమ్మ విగ్రహాలకు పైకప్పులు నిర్మించారు. తమకు పాఠాలు చెప్పిన గురువులు సాంబశివరావు, ఎఎస్ఆర్.మూర్తి, లక్ష్మీశ నరసింహమూర్తిని ఘనంగా సత్కరించారు.

17 నుంచి జిలానీ మెమోరియల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి-దివిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 17, 18, 19 తేదీల్ల వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ఎమ్ జిలాని మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విజేతలకు షీల్డ్‌లతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.8 వేలు, ప్రత్యేక బహుమతి రూ.5 వేలు అందజేస్తారన్నారు. క్రీడాకారులు 70 కేజీల బరువు మించరాదన్నారు. జట్టు క్రీడాకారులందరూ ఒకే ఊరు వారై ఉండాలన్నారు. ప్రతి క్రీడాకారుడి ఆధార కార్డు జత చేయాలన్నారు. ఈ నెల 16వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి పోటీలు ప్రారంభం అవుతాయన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆర్ఐఒ ఎస్ఎస్వివిఎల్ నర్సింహం





ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీ చేసింది. సిసి కేంద్రాల పర్యవేక్షణలో పకడ్బందీగా పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం సమాయత్తమైంది. ఈ సందర్భంగా ఆర్ఐఒ ఎన్ఎస్వివిఎల్ నర్సింహం వెల్లడించిన వివరాలు..

ఉమ్మడి జిల్లాలో 140 పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో 140 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాము. తూర్పు గోదావరిలో 47, కాకినాడ జిల్లాలో 60 సెంటర్లు, కోనసీమ జిల్లాలో 38, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 సెంటర్ల చొప్పున ఏర్పాటు చేశాము. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,02,643 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో తూర్పు గోదావరిలో 26,931, కాకినాడ జిల్లాలో 41,817, కోనసీమ జిల్లాలో 28,973, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4922 మంది ఉన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యానికి అవకాశం లేకుండా పరీక్షా కేంద్రాల్లో వసతులు మౌలిక సదుపాయాలు కల్పించాము.

సిసి కెమెరాల పర్యవేక్షణలో నిర్వహణ

సిసి కెమేరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వహించనున్నాము. అన్ని కేంద్రాల్లో తాగునీరు, మౌలిక వసతులు కల్పించాము. ఉన్నతాధికారులు ఇతర శాఖలతో సమన్వయం చేసి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో ప్రాథమిక వైద్యం అందించే దిశగా చర్యలు చేపట్టారు. ఇన్విజిలేటర్లతో సహా ఎవరూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అవకాశం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు

ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ పరీక్షలు జరుగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలను నిర్వహించనున్నాము. విద్యార్థులందరూ కచ్చితమైన సమయపాలన పాటించాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతించే అవకాశం లేదు. కావున విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఆ దిశగా రవాణా ఏర్పాట్లు చేసుకోవాలి. ఒక రోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్ధారించుకోవాలని సూచిస్తున్నాము. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలలో ప్రతిభను కనబర్చాలి.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాము. పోలీసు శాఖ వారిసహకారం తీసుకుంటున్నాము. ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నాము. ఈ పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్లతో పాటు 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు,10 సిట్టింగ్ స్క్వాడ్‌లను కేటాయించాము. వారు నిరంతరం పర్యవేక్షిస్తారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల సెట్లను స్టోరేజ్ కేంద్రాలకు పంపించాం. ఫీజు బకాయిలు చెల్లించలేదనే కారణంగా హాల్‌టిక్కెట్లు పంపిణీ నిలపవద్దని ప్రైవేటు కళాశాలలకు ఆదేశించాం.

ఇబ్బందులకు గురి చేస్తే ఫిర్యాదు చేయొచ్చు

విద్యార్థులకు సకాలంలో హాల్ టికెట్లు జారీ చేయాలని జిల్లాలోని అన్ని కళాశాలల మేనేజ్‌మెంట్‌లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాము. ఇంకనూ ఎవరైనా తీసుకోని విద్యార్థులు ఉంటే కళాశాల ప్రిన్సిపల్‌ను కలిసి పొందవలెను. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామంటూ ఇబ్బంది పెడితే ఇంటర్మీడియెట్ విద్యా శాఖ బోర్డుకు ఫిర్యాదు చేయొచ్చు. అటువంటి యాజమాన్యాలపై చర్యలు తప్పవు.

యానాం వార్తలు

అసెంబ్లీలో ఆసుపత్రి సమస్యలపై ప్రస్తావన

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలపై పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించనున్నట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకం చేపట్టాలని కోరనున్నట్లు తెలిపారు. పలు విభాగాలకు సంబంధించి ప్రత్యేక వైద్యులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాకినాడ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సివస్తుందన్నారు. డిజిటల్ ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కానింగ్, ఫిజియోథెరపీ, తదితర సౌకర్యాల కల్పనపై ప్రస్తావిస్తానన్నారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం అమలు కాకపోవడంపై ప్రశ్నించనున్నట్లు తెలిపారు. యానాంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలు గత ఆరోగ్య పథకాలకు సంబంధించి వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు తదితర సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

యుడిసి కోచింగ్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యుడిసి ఉచిత కోచింగ్ క్లాసులు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ దయాలనే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో పుదుచ్చేరి ఆది ద్రావిడ, షెడ్యూల్ ట్రైబ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (పాడ్కో) యానాం శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ గోపాల్ నగర్‌లో క్లాసులు ప్రారంభం అవుతాయని చెప్పారు. పాడ్కో యానాం శాఖ ద్వారా కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

నేరాలు ఘోరాలు

యువకుని అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-మండపేట

యువకుని అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్ లో ఆదివారం రాత్రి కేసు నమోదు అయింది. తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలంలోని దుగ్గుదూరు గ్రామానికి చెందిన కొల్లి ప్రేమ కుమార్ తండ్రి కొల్లి ఇజ్రాయేలుతో కలిసి మండపేటలో దళితపేటలో ఉన్న బంధువులను చూసేందుకు ఈనెల 9 వ తేదీన ఉదయం వచ్చాడు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు మండపేట నుండి తిరిగి తన ఇంటికి వెళ్లే క్రమంలో అదృశ్యమయ్యాడు. బంధువులు, తెలిసినవారు ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ అప్పారావు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకీ తెలిసినవారు ఈ కింది సెల్‌నెంబర్లకు తెలపాలని బంధువులు కోరుతున్నారు. 98855 87729,78933 88092,79930 88964

కాలువలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి మండలంలోని మల్లంపేట వెళ్లే రహదారి ఆనుకొని ఉన్న ఏలేరు ఎడమ కాలవలో పడి ఆదివారం మహిళా మృతి చెందింది. స్థానికులు. కోటనందూరు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రమైన రౌతులపూడి గ్రామానికి చెందిన పోలుపర్తి రాజమ్మ (57) పశువులు మేపుతూ ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో పడిపోవడంతో స్థానికులు రక్షించే లోపు ఆమె మృతి చెందింది. ఆమెకు భర్త, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని కోటనందూరు పోలీసులు తెలిపారు.

గాయపడిన వివాహిత మృతి

ప్రజాశక్తి-కాజులూరు

మెట్ల నుంచి పడి వివాహిత పిల్లా రమ దేవి (47) మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు, గొల్లపాలెం పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం .. మండలంలోని కోలంక గ్రామానికి చెందిన రమాదేవి గత కొన్ని రోజులుగా హైబిపి, షుగర్, థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. శనివారం అర్ధరాత్రి మెట్లపైనుండి పడిపోవడంతో ఆమెకు గాయమైంది. ఆమెను కుటుంబ సభ్యులు యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని వారు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.

అన్నవరం ప్రసాదం ప్యాకర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-అన్నవరం

దేవస్థానంలో సత్యదేవుని ప్రసాదం తయారీ కేంద్రంలో ప్యాకర్ గా పనిచేస్తున్న కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం కొండపైన వండిన ప్రసాదం కళాయిని పొయ్యిపై నుంచి దించుతుండగా ప్రమాద వశాత్తు పోలనాటి సత్యనారాయణ కళాయిలో పడి పోయాడు. దీంతో అతని వీపు, చేయి భాగం కాలడంతోతీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని హుటాహుటిన కాకినాడలో కార్పొరేట్ ఆసుపత్రి కి తరలించారు. కార్మికుని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని సంబంధింత అధికారులు వెల్లడించారు.

అడుగంటిన మంచినీటి చెరువులు


యానాం చెరువులో అడుగంటిన నీరు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో తాగునీటి చెరువుల నీటిమట్టం పూర్తిగా అడుగంటింది. దీనికి ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. యానాం ప్రజలు ప్రతి ఏడాది వేసవిలో తాగునీటిపై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవికాలం మొదలవకముందే చెరువులు నింపాల్సిన బాధ్యత అధికారులదని, కానీ పిడబ్ల్యుడి అధికారుల నిర్లక్ష్యం వల్లే యానాం ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాంలో ఎన్నో సంవత్సరాలుగా యథాస్థానంలో ఇంజనీర్లుగా కొనసాగుతున్న నిర్లక్ష్యపు వైఖరి మార్చుకోవడం లేదని ప్రతి సంవత్సరం వేసవిలో ఇదే సమస్య తలెత్తుతోందన్నారు. ధవళేశ్వరం నుంచి రూ.55 కోట్ల పైబడి యానాంకు మంచినీటి పైప్ లైన్ వేసిన నీటి సమస్య పరిష్కారం చూపలేదన్నారు. నల్ల చెరువు సమీపంలో ఉన్న 55 ఎకరాల చెరువుల్లో జనవరి నెల నుండి నీటిని నింపాలని అది తెలిసికూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార వాపోతున్నారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తితే దానికి కారణం పూర్తిగా పిడబ్ల్యుడి అధికారుల వైఫల్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఈమధ్య కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అదే గ్రామంలో ప్రస్తుతం కలుషితమైన తాగు నీరు సరఫరా చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని, ముందస్తుగా చెరువులు నింపాలని పలువురు కోరుతున్నారు. ఈ మధ్యకాలంలో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి కాకినాడ జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లాను కలిసి తాగునీటి ఎద్దడిపై వినతి పత్రాన్ని అందించారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ కుమార్ యాదవ్

రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వాతావరణం మారుతున్న క్రమంలో సహజంగా వైరస్‌లు ప్రభావం చూపుతాయని, ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని డాక్టర్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఫ్లూ వైరస్ కారణంగా పలువురు తీవ్రమైన దగ్గు, జలుబు, గొంతు నొప్పి, ఒళ్ళు నొప్పులు, జ్వరంతో బాధ పడుతున్నారని అన్నారు. వద్దులు ఎక్కువగా వీటితో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జ్వరం మాత్రం రెండు మూడు రోజులలో తగ్గినా జలుబు, దగ్గు మాత్రం ఎక్కువ రోజులు వేధిస్తున్నాయని అన్నారు. దీన్ని అధిగమించడం కోసం ప్రతి ఒక్కరూ విధిగా మాస్క్ ధరించాలని, ఈ లక్షణాలున్న వ్యక్తులకు సన్నిహితంగా ఉండరాదని డాక్టర్ యాదవ్ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, సత్యనారాయణ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న నాటు సారా

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గోకవరం

మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలోని నాటు సారా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. సారా వ్యాపారం మూడు సీసాలు ఆరు పేకెట్లుగా సాగుతుందని ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా ఈ సారా వ్యాపారం సాగేది. ప్రస్తుతం సారా వ్యాపారాలు గ్రామాల్లో బహిరంగంగానే సాగుతున్నాయి. మద్యం ధరలు పెరగడంతో సారాకి డిమాండ్ పెరిగింది. గతంలో ఒక సారా ప్యాకెట్ రూ.పది ఉండేది. అదే ప్యాకెట్ ప్రస్తుతం రూ.50కు విక్రయిస్తున్నారు. మందుబాబులకు మద్యం ధరలు పెరగడంతో సారాకు మొగ్గు చూపుతున్నారన్నారు అందువలన సారాకి డిమాండ్ పెరిగి వ్యాపారులు అధికంగా అర్జిస్తూ ఉన్నారని చెప్పవచ్చు

ఎస్ఇబి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో మండలాలే కాకుండా జిల్లావ్యాప్తంగా సారవిక్రయాలు రవాణా వ్యాపారాలు ఎక్కువయ్యాయని ప్రజల ఆరోపిస్తున్నారు. సారా విక్రయాలు బహిరంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మొక్కుబడిగా అక్కడక్కడ కేసులు తప్ప సారా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవడం లేదు.

దీనిలో భాగంగానే గోకవరం మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో ఉండే కొన్ని గ్రామాలు గోకవరం, వెదురుపాక, బాలాజీ పేట, మల్లవరం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, తిరుమలయపాలెం, గంగంపాలెం, కొత్తపల్లి, కామరాజుపేట, గాదేలపాలెం, ఇటికాయలపల్లి, గుమ్మళ్లదొడ్డి, తంటికొండ తదితర గ్రామాల్లో అధికంగా బహిరంగ సారా వ్యాపారాలు సాగుతుందని చెబుతున్నారు. అంతేకాక ఇతర ప్రాంతాలు మల్లిసాల, గంగవరం, ముల్లేరు, మల్లవరం ఏజెన్సీ ప్రాంతాల నుంచి కూడా సారా రవాణా జరుగుతోంది. సారా విక్రయాలపై యువత మొగ్గు చూపుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటూ ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. ఎస్ఇబి అధికారులు ప్రతి గ్రామంలో దాడులు చేసి సారా విక్రయాలు నియంత్రించాలని కోరుతున్నారు

సారా బట్టీలు గతంలో అడవులు, కాలువల్లో ఇతర ప్రాంతాల్లో గుట్టుచప్పుడుగా బట్టీలు పెట్టి సారా తయారు చేసేవారని, ప్రస్తుతం మామిడి, జీడి మామిడి తోటల్లో, ఊరికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో, కొంతమంది ఇంటి వద్దనే బట్టీలు పెట్టి సారా తయారు చేస్తున్నారని చెబుతున్నారు.

ఈ సారా తయారీకి నల్ల బెల్లం కూడా మండల కేంద్రం నుండి వస్తోందని నల్ల బెల్లం వ్యాపారాలు కూడా విచ్చలవిడిగా అమ్ముతున్నారని విమర్శలు ఉన్నాయి, ఎస్ఇబి అధికారులు ముందు నల్ల బెల్లం (సారా బెల్లం) అమ్మకాలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు ముఖ్యంగా గోకవరం, వెదురుపాక, కామరాజుపేట, మల్లవరం, రంపఎర్రంపాలెం, పెంటపల్లి, తిరుమలాయపాలెం, గంగంపాలెం గ్రామాల వైపు ఎస్ఇబి అధికారులు చూడరని విమర్శలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సారా అధిక విక్రయాలు జరిపిన ఎస్ఇబి అధికారులు మాత్రం ఏమీ పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఎస్ఇబి అధికారులు స్పందించి గోకవరం మండలంలో సారా నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సారా బట్టీ(ఫైల్ ఫొటో)



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మండపేట

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు దూలి జయరాజు అన్నారు. ఆదివారం మండలంలోని మారేడుబాక గ్రామంలోని వికలాంగుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు షేక్ నబి అధ్యక్షతన గ్రామ వికలాంగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వికలాంగులకు రూ.6వేలు వరకు పెన్షన్ పెంచడంతోపాటు 35 కేజీల బియ్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పసలపూడి శ్రీనివాస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి కపిలేశ్వరం మండల అధ్యక్షురాలు కాళిదాసు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


ఒకే చోట ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్లు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని వెదురుపాక గ్రామపంచాయతీ పరిధి బావాజీపేట ప్రధాన రహదారికి ఆనుకుని మూడు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి. ట్రాన్స్ ఫార్మర్ లు చుట్టూ తుప్పలు ఉండటంతో అక్కడ తరచూ మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు ఆ ట్రాన్స్ ఫార్మర్లను ఆనుకుని ఉన్న రోడ్డుపై నుంచి వాహనాలు ఎక్కవలసి వస్తోంది. ఏప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఎండలు తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వేరే ప్రాంతానికి తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను రెండు గ్రామ ప్రజలు కోరుతున్నారు

అందుబాటులో పెయిన్ మేనేజ్ మెంట్ వైద్య చికిత్స

దీపక్ పెయిన్ మేనేజ్ మెంట్ ఆసుపత్రి ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

అత్యాధునిక వైద్య విధానంలో దీర్ఘ కాలిక నొప్పులను మందులు, ఇంజెక్షన్ల ద్వారా చికిత్స చేస్తామని డాక్టర్ ఎన్.దీపక్ చెప్పారు. ఆర్యాపురంలో డాక్టర్ ఎన్.దీపక్ ఆధ్వర్యంలో దీపక్ పెయిన్ మేనేజమెంట్ సెంటర్ , పెయిన్, జనరల్ మెడిసిన్ విభాగాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఆసుపత్రిని ఆదివారం డాక్టర్ వాసిరెడ్డి ప్రసాద్, డాక్టర్ పావురి మధు ప్రారంభించారు. పెయిన్ డిపార్టెమెంట్‌ను పెయిన్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ జోషి, డాక్టర్ ప్రజ్ఞ, జనరల్ మెడిసిన్ డిపార్ట్మెంట్‌ని చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ఎన్ఎస్ఆర్.మూర్తి ప్రారంభించారు. ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను రాజమహేంద్రవరం ఐఎమ్ఎ అధ్యక్షులు డాక్టర్ వై.గురు ప్రసాద్, ఐఎమ్ఎసెక్రటరీ డాక్టర్ పి.విజయ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపక్, డాక్టర్ ప్రజ్ఞ ఇఎన్‌టి.స్పెషలిస్టు డాక్టర్ చాణక్య మాట్లాడారు. ఇందులో అత్యాధునాతన విధానంలో నడుము నొప్పి, సయాటిక, మెడ నొప్పి, దీర్ఘకాలిక నొప్పులకు మందులు, ఇంజక్షన్ల ద్వారా చికిత్స చేస్తామన్నారు.